

ఎస్టేట్ ఆక్రమణలపై ఉత్కంఠ!

- ఆకేపాటి తరుపున విచారణకు న్యాయవాది హాజరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : జిల్లాలోని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఎస్టేట్ ఆక్రమణలపై ఉత్కంఠ నెలకొంది. రాజంపేటకు చెందిన టిడిపి నాయకుడు ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సిఎం ఆకేపాటి ఆక్రమణలపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే. కలెక్టర్ స్పందించి ఆకేపాటి కుటుంబీకులకు విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. జెసి ఆధ్వర్యంలో విచారణకు శనివారం సాయంత్రం ఐదు గంటలలోపు ఎస్టేట్ భూముల రికార్డులను అందజేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి తన తరపున ఒక న్యాయవాదిని రికార్డులతో సహా విచారణకు హాజరుపరిచారు. శనివారం నాటి విచారణలో ఆకేపాడు, మందపల్లి, శేషమాంబపురం పంచాయతీ పరిధిలోని భూముల రికార్డులను న్యాయవాది అందజేశారు. రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో సేకరించిన రెవెన్యూ రికార్డులతో ఆకేపాటి ఎస్టేట్ రికార్డులు సరిపోలుతాయా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. రెవెన్యూ అధికారుల సర్వే రికార్డులతో ఆకేపాటి న్యాయవాది అందజేసిన రికార్డులు సరిపోలని పక్షంలో ఏమి జరుగుతుందనే ఉత్కంఠ రేకెత్తింది. ఇటీవల రాజంపేటలోని షాపింగ్ కాంప్లెక్సు కూల్చిన తరహాలో ఆకేపాటి ఎస్టేట్‌లోని ఆక్రమణలను కూల్చుతారా అనే ఆందోళన నెలకొంది.

సర్వం సిద్ధం

నేడు గ్రూప్-2 మెయిన్ పరీక్షలు
జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
పరీక్షలు రాయనున్న 5825 మంది అభ్యర్థులు



ప్రజాశక్తి-కడప

గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని 5825 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పార్ట్-1 సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పార్ట్-2 సెషన్ నిర్వహిస్తారు. జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు తగ్గ అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కడప నగరం, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేశారు. కెఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 720 మంది, కడప ఆర్ట్స్ కళాశాలలో 283 మంది, కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 720 మంది, చింతకొమ్మదిన్నెలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో 504 మంది, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో 480 మంది, శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 450 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. కడప శ్రీహరి డిగ్రీ, జూనియర్ కళాశాలలో 480 మంది, ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాలలో 480 మంది, నారాయణ జూనియర్ కళాశాలలో 384 మంది, ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 360 మంది, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో 312 మంది, శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో 312 మంది, కెఐఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 310 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎపిపిఎస్‌సి గ్రూప్-2 మెయిన్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను అధికారుల సమన్వయంతో చేస్తున్నాం. అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటల నుండి 9.45 గంటల వరకు, 1.30 గంటల నుండి 2.45 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ఏడుగురు లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్ వైజర్లు నియమించాం. పరీక్షలు సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నాం. కలెక్టర్ కార్యాలయంలో గ్రూప్-2 మెయిన్ పరీక్షలు సంబంధించి హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశాం. హెల్ప్ డెస్క్ నంబర్ 08562-246344.



- ఎం.విశ్వేశ్వర నాయుడు, డిఆర్ఓ కడప.

బి.కొత్తకోటలో ఉద్రిక్తత

- రీ సర్వేలో అవకతవకలపై పెట్రోల్, పురుగు మందుతో రైతులు ఆత్మహత్యాయత్నం
- తహశీల్దార్ హామీతో ఆందోళన విరమించిన రైతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని గుమ్మసముద్రంలో రీసర్వేలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ రైతులు పురుగు మందులు, పెట్రోల్‌తో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమశీల్దార్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గుమ్మసంముద్రం గ్రామంలో ఏఒక్క రైతుకి వన్‌బి పత్రాలు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని దేవుని మాన్యం భూమిని విలేజ్ సర్వేయర్ రాజేంద్ర తన తల్లి పేరు మీద ఆన్‌లైన్ చేసుకున్నాడని రైతులు ఆరోపించారు. తమ సమస్య తీర్చాలంటూ పెట్రోల్, ఉరితాళ్లు, పురుగులు మందు డబ్బాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడానికి గుమ్మస ముద్రం గ్రామం రైతులు సిద్ధమయ్యారు. గుమ్మసముద్రం విఆర్ఒ కోటిరెడ్డిపై తహశీల్దార్ కార్యాలయం ఎదుట గండువారిపల్లి గ్రామస్తులు తిరుగుబాటు చేశారు. అవకతవకలకు పాల్పడిన విఆర్ఒ, సర్వేయర్లను వెంటనే సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తాను కొత్తగా వచ్చానని తనకు తెలియదని సమస్య పరిష్కారం చేస్తానని తాహశీల్దార్ చెప్పినా రైతులు ఒప్పుకోలేదు. కలెక్టర్ స్వయంగా వచ్చేంత వరకూ ఇక్కడి నుంచి కదిలేదంటూ గుమ్మసముద్రం గ్రామం రైతులు భీష్మించుకు కూర్చున్నారు. గత ప్రభుత్వంలో చేసిన రీ సర్వేలలో బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలంలో అనేక అవినీతి జరిగిందని రైతులు చాలావరకు తమ భూములను కోల్పోయామని సర్వేయర్లు చేసిన అవకతవకల్లో గ్రామస్తులు అందరి భూములకు జాయింట్ ఎల్‌పిఎంలు చేయడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని దీనికి ఉన్నతాధికారులు పరిష్కారం చూపాలని లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బి.కొత్తకోట తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ రైతులతో మాట్లాడుతూ వచ్చే సోమవారం నుండి మీ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు. గుమ్మసముద్రం రైతులకు అండగా ఉంటామని, రైతాంగ పోరాటంలో భాగస్వాములమవుతామని సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, మండల నాయకులు జి.రఘునాథ్, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజన్నప్ప, నియోజకవర్గపు సహాయ కార్యదర్శి మల్లికార్జున స్పష్టం చేశారు. రైతులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వారితో కలిసి నిరసనలో పాల్గొన్నారు. గుమ్మసముద్రం రీ సర్వేలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, తిరిగి సర్వే చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను నిర్దిష్ట ప్రణాళిక మేరకు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐఒ కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20 వరకు 49 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులందరూ అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మొదటి సంవత్సరం 14855 మంది, రెండవ సంవత్సరం 13747 మంది, మొత్తంగా 28602 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని చెప్పారు. వీరితోపాటు 2156 మంది ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలని, కాపీయింగ్ పూర్తిగా అరికట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితులలో విద్యార్థులు సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్, డిజిటల్ పరికరాలు తీసుకువెళ్లరాదన్నారు. పోలీసులు ముందుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్‌లు ఉండేలా అధికారులు చూసుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులతో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, మండలానికి ఒక అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య శాఖను ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు అన్ని రూట్లలో సకాలంలో బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి వారిని, కస్టడీలో ఉన్న ప్రశ్నాపత్రాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్ష అనంతరం జవాబు పత్రాలను తీసుకెళ్లేందుకు అవసరమైన ఏర్పాటు చేయాలని పోస్టల్ శాఖకు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి ఎం.వెంకటాద్రి, డిఆర్ఒ మధుసూదన్‌రావు, డిఇఒ సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు ఎం.ప్రకాష్, ఎస్.అమరేంద్ర కుమార, ఓ.నాగ సురేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, వైద్య, ఆర్‌టిసి, ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు



నిరసన తెలుపుతున్న ఆప్కాస్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వ విధానాలు కార్మికవర్గాల్లో భయాందోళనకు కారణమవుతున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆప్కాస్ కొనసాగించాలని, దళారీ వ్యవస్థ తీసుకు రావద్దని ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు. నిత్యం ప్రజారోగ్యం కోసం విషవాయువులతో సవాసం చేస్తూ, కరోనాలో సైతం ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేసిన మున్సిపల్ కార్మికులను ప్రతి ఒక రాజకీయ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారని, ఇప్పుడు వారిని పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఆప్కాస్‌లో ఉంటూ ప్రతి నెల సకాలంలో జీతాలు తీసుకుంటుంటే దాన్ని రద్దు చేసి దళారీ వ్యవస్థకు కట్టబెట్టే కూటమి ప్రభుత్వ ఆలోచనని రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ మాట్లాడుతూ డ్రైవర్‌లకు జీతం రూ.24,500 ఇవ్వాలని ఏడాది కిందటే జిఒ వచ్చినా రాయచోటిలో అమలు కాలేదని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలతోపాటు వారిలో ఐదుగురికి 8 నెలల వేతనం ఇవ్వలేదని పేర్కొన్నారు. వేసవి రీత్యా టోపీలు, మజ్జిగ, కొబ్బరినూనె చెప్పులు యూనిఫాం ఇవ్వాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ వాసు బాబుకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు యం. చెన్నయ్య, వాటర్ సెక్షన్ నాయకులు అక్బర్, శంకరయ్య, రమణరెడ్డి, రెడ్డి శేఖర్, తిరుపాల్, వెంకటరమణ, మంగమ్మ, ఉమా మహేశ్వరీ, కేశమ్మ, సిద్దిమ్మ, సురేష్, కిరణ్ పాల్గొన్నారు.

స్థలాలను ఆక్రమించుకోవాలని చూస్తున్నారు

-ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న బాధితులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేనేత కార్మికులమైన తాము కొనుగోలు చేసిన స్థలాలను అధికార పార్టీ నాయకుడు కబ్జా చేసి ఆక్రమించుకోవాలని చూస్తున్నారంటూ బాధితులు శనివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మదనపల్లి పట్టణం బికె.పల్లి సర్వే నెంబర్ 423-2 లెటర్‌లో 2.20 ఎకరాల స్థలంలో 77 ఫ్లాట్లకు సంబంధించి 1997 నుండి రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయన్నారు. ఈ సంవత్సరం సదరు నాయకుడు తప్పుడు పత్రాలను సృష్టించి, తమ ఫ్లాట్లను చదును చేస్తూ కంచె ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. లేనిపక్షంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యను విన్నవిస్తామన్నారు. రూపాయి, రూపాయి కూడబెట్టుకుని రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలాలను ఇలా ఆక్రమించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంచి చేయాల్సిన నాయకులు, అధికారులు ఇలా అక్రమాలకు పాల్పడుతుంటే సామాన్యులకు న్యాయం ఎక్కడ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె సబ్ రిజిస్ట్రారుని పిలిపించి ఆ సర్వే నంబరుకు సంబంధించి ప్లాట్లను హోల్డ్‌లో పెట్టాలని సూచించారు. ప్లాట్లు కొనుగోలు చేసి ప్లాన్ అప్రూవల్ పొందినవారు నిర్మాణాలు చేసుకోమన్నారు.

'రాజ్యం..విప్లవం' పుస్తకం అందరూ చదవాలి

- మిట్స్ కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లెనిన్ రచించిన 'రాజ్యం..విప్లవం' పుస్తకం ప్రపంచానికి కొత్త దశ దిశను నిర్దేశించిందని ఈ పుస్తకం అందరూ చదవాలని మిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండంట్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, నాయకులు హరిశర్మ, నరసింహలతో కలసి లెనిన్ ప్రసిద్ధ రచన 'రాజ్యం-విప్లవం' పుస్తకాన్ని శనివారం అందచేశారు. ఈ సందర్భంగా విజభా స్కర్ చౌదరి మాట్లాడుతూ విద్యావిధానంలో 30 ఏళ్లుగా వచ్చిన మార్పుల్లో వ్యక్తి వాదం ముందుకు వచ్చి సామాజికాభివృద్ధి వెనక్కుపోయిందన్నారు. సంస్కరణల అమల్లో భాగంగా విద్యా వ్యవస్థను దెబ్బతీశారని, ఇది సామాజికాభివృద్ధిని దెబ్బతీసిం దని, దాని ప్రభావం వల్ల సంక్షోభం ఏర్పడిందని వివరించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సంస్కరణల అమలు చేపట్టిన 30 ఏళ్ల తరువాత ప్రపంచీకరణ సంక్షోభంలో పడిందన్నారు. రాజ్యం-విప్లవం పుస్తక ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు ప్రణాళికకు కొనసాగింపుగా ఈ పుస్తకం వచ్చిందన్నారు.

విద్యార్థులు రోల్ మోడల్‌గా ఎదగాలి

ప్రజాశక్తి - రాయచోటి

స్కౌట్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సేవా భావం పెంపొందుతుందని డిఇఒ సుబ్రమణ్యం అన్నారు. స్కౌట్ ఉద్యమ పితామహుడు బాడెన్-పావెల్ జయంతిని పురస్కరించుకుని సంబేపల్లి హైస్కూల్లో శనివారం నిర్వహించిన 'వరల్డ్ థింకింగ్ డే' వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కౌట్ అధికారులతో కలిసి బాడెన్-పావెల్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి ఆలోచనల ప్రాముఖ్యతను తెలియజేయడానికి, పర్యావరణం, విద్య, లింగ సమానత్వం లాంటి సామాజిక అంశాలపై చర్చించేందుకు ఇటువంటి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, స్కౌట్ మాస్టర్‌లు మార్ల ఓబుల్ రెడ్డి, మురళీ నాయక్, షామీర్ బాష, గైడ్ కెప్టెన్ రాచూరి సుజాత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె :** స్కౌట్ పితామహుడు లార్డ్ బాడెన్ పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని మదనపల్లిలో ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని జిల్లా స్కౌట్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో ఇప్పటినుంచి మెరుగైన సమాజం ఎలా అభివృద్ధి చేయాలో తెలిపామన్నారు. కూరపర్తి ఆశ్రమం నిర్వాహకులు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ స్కౌట్ పిల్లలు మా స్కూల్‌కి వచ్చి ఈ విధంగా చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చీకలు బైలు స్కూల్ స్కౌట్ ఉపాధ్యాయులు ఉమా, భార్గవి, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గాజులవారిపల్లి శివగంగా, గంగాధర్, గొల్లపల్లి స్కూల్ సరిత, పెద్దచెన్నయ్యగారిపల్లి విజయ్ కుమార్, ఈశ్వరమ్మ కాలనీ మంజుల పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన ఎస్‌సి మానిటరింగ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-పీలేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తాను జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వారు డిజిపిని మంగళగిరిలోని ఆయన ఛాంబరులో మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. డిజిపి దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లామన్నారు. జిల్లా పరిధిలో పెండింగులో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు.

డిసిసి మైనార్టీ చైర్మన్‌గా సయ్యద్ అలీ

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణానికి చెందిన ఎస్.సయ్యద్ అలీని డిసిసి మైనార్టీ చైర్మన్‌గా నియామకం ఉత్తర్వు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన పదవికి సహకిరంచి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

25న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : ఈ నెల 25వ తేది మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి వివిధ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మనోహర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి, ఇడబ్ల్యూఎస్, కాపు, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తమ వెంట దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్‌తో పాటు సర్టిఫికెట్లను మూడు సెట్లు తీసుకొని రావాలని సూచించారు.

'రూట' రాష్ట్ర కన్వీనర్‌గా రహమతుల్లా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణంలోని మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సయ్యద్ రహమతుల్లాబాషను శనివారం ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూట సంఘం బలోపేతనానికి, ఉర్దూ విద్యా సంస్థల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాక్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి-రాయచోటి : జిల్లాలోని అన్ని డివిజన్ ఆఫీసుల పరిధిలో ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని జిల్లా పర్యవేక్షణ అధికారి అర్.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమిస్తాం

- యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమిస్తామని యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజయభారతి స్కూల్, మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు సుధాకర్ నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహా మాట్లాడుతూ విద్యార్థులు మార్చి 17వ తేదీన జరిగే పబ్లిక్ పరీక్షలకు ఈ ప్రశ్న పత్రం కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యారంగ సమస్యలపైన నిత్యం పోరాడుతూ విద్యార్థుల సంక్షేమ ధ్యేయంగా ఎస్ఎఫ్ఐ పనిచేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. ఇలాంటి ప్రజాక్ష వికాస పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మరో చైతన్యం నింపడానికి మంచి అవకాశంగా ఉందని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కూడా మదనపల్లి ప్రాంతంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కంప్యూటర్ కోచింగ్ స్పోకెన్ ఇంగ్లీష్ తదితర పైన ఉచితంగా కూడా ఇస్తామని తెలిపారు. విద్యార్థులందరూ ఇటువంటి అవకాశాన్ని ప్రతి ఒక్కటి కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్య వ్యవస్థను పూర్తిగా నెరవేరేపరిస్థితి ఈ రాష్ట్రంలో, దేశంలో ఉందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘం, విద్యార్థి సంఘంగలపై ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పైన విద్యార్థుల సమస్యలపైన అనునిత్యం పోరాడటమే కాకుండా ఇలాంటి ప్రజ్ఞా వికాస పరీక్షను విద్యార్థులకు నిర్వహించడం ద్వారా వాళ్లలో ఉన్న భయాన్ని పోగొట్టి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయడానికి నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, యుటిఎఫ్ మండల కార్యదర్శి గాలి రవీంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రీద్, కమిటీ సభ్యుడు జయబాబు, సమీర్, ప్రేమ్ కుమార్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు రమణ, యుటిఎఫ్ నాయకులు నాగరాజు, సురేంద్ర, మదన్ మోహన్‌రెడ్డి, అన్వర్‌బాషా, టిరామచంద్ర నాయుడు, చలపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, భారతమ్మ, హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రమీల మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మదన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఓబులేషు, వై.వి.రమణారెడ్డి, వెంకటరామరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



ప్రజ్ఞా వికాస పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిగ్గుతేలేనా?

ప్రజా'దృష్టి'

ఉమ్మడి జిల్లాలోని భూ ఆక్రమణలపై సర్వే శకం నడుస్తోంది. కూటమి ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వ హయాంలో కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకున్న భూ ఆక్రమణల్ని నిగ్గు తేల్చడంపై సీరియస్‌గా దృష్టి సారించింది. రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడిన వెంటనే ప్రత్యర్థుల ఆక్రమాలపై దృష్టి సారిచింది. అన్నమయ్య జిల్లాలో మదనపల్లి ఫైల్స్ ఘటన, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్, అనంతరం కడప జిల్లాలో వైసిపి కీలక నాయకుడు సజ్జల ఎస్టేట్ పేర్లతో పాల్పడిన భూఆక్రమణలపై సర్వే చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ వైఖరిని పరిశీలిస్తే ప్రత్యర్థి పార్టీకి చెందిన ఆక్రమార్కులే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోంది. 2014-2019 పీరియడ్‌లో చుక్కల భూములను స్వాహా చేసిన ఆక్రమార్కులను భరతం పడితేనే విశ్వసనీయత పెరుగుతుందని చెప్ప వచ్చు. ప్రత్యర్థులను వెంటాడడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని గ్రహించాలి. సర్వే, విచారణ ద్వారా వాస్తవ ఆక్రమణల్ని వెలికితీయడం, అక్రమార్కులపై కేసులు నమోదు చేయడం వరకు బాగానే ఉంటుంది. ఆక్రమార్కులు కోర్టును ఆశ్రయించడం ద్వారా ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న ఎదురవుతోంది. రెవెన్యూ కేసులు కోర్టుల్లో తేలేసరికి పాలకులు మారిపోయే రోజుల్లో ఉన్నామనే వాస్తవాన్ని గ్రహించాలి. భూముల ఆక్రమణల్ని స్వాధీనం చేసుకోవడానికి గల అవకాశాలను అన్వేషించాలి. లేనిపక్షంలో భూ ఆక్రమణలకు తెరపడడం ఎప్పటికీ సాధ్యం కాదనే సంగతిని గ్రహించాలి. 2014-19 పీరియడ్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే కుటుంబాల ఆక్రమణల పర్వంపై పత్రికల్లో పతాకశీర్షికలను ఆక్రమించిన సంగతి తెలిసిందే. ఆక్రమణదారుల చెరలోని భూములకు సంబంధించిన కచ్చితమైన ఆధారాలతో ముందుకు కదలాలి. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకునేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ఫైల్స్ ఘటన మరకముందే రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్ భూ ఆక్రమణలపై విచారణ ముగిసేలోపు తాజాగా వైసిపి కీలక నాయకులు సజ్జల ఎస్టేట్‌లోని భూ ఆక్రమణలపై సర్వే చేపట్టడం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. భూ ఆక్రమణలపై కుటుంబ సభ్యుల పేరిట భూములు పెట్టడం, దానవిక్రయాది వంటి లొసుగులను, కపట నాటకాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి, సజ్జల ఎస్టేట్‌లోని ప్రభుత్వ, డికెటి, ఫారెస్ట్ భూముల వాస్తవాల వివరాలను నిగ్గుతేల్చాలి. ఆక్రమణదారులపై పకడ్బందీగా కేసులు నమోదు చేసి ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



టిబిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

క్షయ లేని సమాజ స్థాపనే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

క్షయవ్యాధి లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. డిఎంహెచ్‌ఒ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టిబి వ్యాధి పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుచు రెండు వారాలకు పైబడి దగ్గు ఉన్నా, దగ్గినపుడు గళ్ళ పడటం, గళ్ళలో రక్తం పడటం, రోజు సాయంత్రం జ్వరం రావడం, గస, ఆయాసం, నీరసం, ఆకలి లేక పోవుట, బరువు తగ్గడం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి అయి ఉండవచ్చుని అన్నారు. అనుమాన పడి సమీపంలో ఉన్న ఆశాకార్యకర్తను గానీ, ఆరోగ్య సిబ్బందిని గానీ సంప్రదించి వ్యాధి నిర్ధారణ కొరకు గళ్ళ పరీక్షలు, నిర్వహించి నిర్ధారణ ఐతే చికిత్స పూర్తిగా ఉచితంగా ఇస్తారని అన్నారు. ఆరు నెలలు మందులు డాట్స్ ద్వారా అందిస్తారని చెప్పారు. టిబి టిబి ముక్త్‌భారత్, ప్రధాన మంత్రి పోషణ అభియాన్‌లో భాగంగా అనుబంధ పోషణ కొరకు టిబి రోగులకు నెలకు వెయ్యి రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. రెండు, ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధి లేని సమాజం స్థాపిద్దాం అని వారు కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ఊరేగిన శివపార్వతులు

ప్రజాశక్తి-కలకడ



మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శివపార్వతులు శేష వాహనంపై ఊరేగారు. ఈనెల 20వ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు మార్చి 3వ తేదీని వరకు నిర్వహిస్తారని చెప్పారు. గురువారం రాత్రి వైశ్యాస్తులు తమకు పవిత్రమైన శేష వాహనంపై శివపార్వతులను రంగురంగుల పూలతో, విద్యుత్తు దీపాలతో అలంకరించి దేవళంపేట, ఎర్రయ్యగారిపల్లి, కలకడ పురవీధులలో ఊరేగించినట్లు ఆలయ ధర్మకర్త రవీంద్ర శర్మ తెలిపారు. ఈ ఊరేగింపులో బళ్లారి డ్రమ్స్, డిజెలు, చిన్నారుల డ్యాన్సులు మధ్య అంగరంగ వైభవంగా జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు విజయసారథి శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

24న ఎన్‌ఆర్‌ఇజిఎస్ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో జరిగిన పనులపై సామా జిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎపిఒ చెన్నకేశవులు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి మార్చి చివరి వరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈనెల 11 నుంచి 23వ తేదీ వరకు గ్రామాల్లో డిఆర్‌పిలు, ఎస్‌ఆర్‌పిలు కలిసి ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 24 నుంచి ఉదయం 10 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు ఉపాధి హామీ సిబ్బంది, మండలంలోని వివిధ శాఖ అధికారులు, హాజరుకావాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌భాషా శనివారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక టిడిపి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. వెంగంవారిపల్లి పంచాయతీ పిల్లగోవుల పల్లెకు చెందిన ఎ.రమణమ్మకు రూ.51,390లు, రెడ్డివారిపల్లి పంచాయతీ దివిటీవారిపల్లెకు చెందిన గోపమ్మకు రూ.3,02,450లు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సిఎం సహాయనిధి వరంలాంటిందని అన్నారు. ప్రజలకు ఎటువంటి కష్టమొచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు జి.శ్రీవాణి నవీన్, సుబ్రమణ్యం, టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసుల రెడ్డి, శ్రీపతి, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యకు బలమైన పునాదులు : సిడిపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పూర్వ ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయడానికి అంగనవాడి కేంద్రాలు పునాదులుగా ఏర్పడుతున్నాయని సిడిపిఒ సుజాత అన్నారు. రెడ్డివారిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో జరుగుతున్న 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సిడిపిఒ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ద్వారా అంగనవాడి కార్యకర్తలకు 120 రోజులపాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారన్నారు. మొదట విడత శిక్షణ ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగగా, రెండవ విడత శిక్షణ 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన, ప్రతిష్టాత్మకమైన విద్యను పిల్లలకు అందించటానికి కార్యకర్తలకు ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో 3 నుంచి 6 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక, భాషాభివృద్ధి చెందుతుందని, పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ శిక్షణ ఉపయోగపడు తుందన్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నరసింహులు, నిర్మల, అంగనవాడి సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల

క్రికెట్‌లో రాణించిన శివకోటి

ప్రజాశక్తి-నందలూరు



ట్రోఫీతో శివకోటి

అంతర్జాతీయ దివ్యాంగుల క్రికెట్‌లో భాగంగా నేపాల్‌తో జరిగిన టీం 20 క్రికెట్ మ్యాచ్ లో భారత జట్టు తరపున పాల్గొన్న నందలూరు కు చెందిన అలుసూరు శివకోటి రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా శనివారం శివకోటి మాట్లాడుతూ నేపాల్ జట్టును భారత్ జట్టు క్లీన్ స్వీప్ చేయడం జరిగిందని అన్నారు. తాను భారత్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించినట్లు తెలిపారు.3 టి20ల్లో 72 పరుగులు చేసి, 11 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా ఎంపిక అయ్యానని అన్నారు. ఫిబ్రవరి 14 నుండి 20వ తేదీ వరకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ ఇండియా వారి ఆధ్వర్యంలో నేపాల్ లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయని అన్నారు.

పేరు మార్పు

అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలం పీవీజీ పల్లి, దేగలవాండ్లపల్లి, డో.నెం: 4/31-ఏ, కాపురస్థులైన పాతూరు ఈశ్వరయ్య గారి భార్య నైన పద్మావతమ్మ అను నేను ఈ దినం నుండి పాతూరు పద్మావతి గా పేరు మార్చుకున్నాను.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతూ, ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీటిని అందించాలని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ఆయా శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారిపై అసహనం వ్యక్తం చేశారు. గైరహాజరైన శాఖల అధికారులకు తక్షణం మెమో జారీ చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. వేసవికాలం సమీపిస్తోందని, ప్రజలకు త్రాగునీటి సమస్యలు లేకుండా ముందస్తుగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి బోర్లు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకోవడం, అవసరమైన పైపులైను సరి చేసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకర్లను శుభ్రపరచాలని ఆదేశించారు. ప్రతిరోజూ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. మండలంలో కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేయలేదని తక్షణం విద్యుత్ సరఫరా సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమ్మనపల్లి కందూర్ రోడ్డులో, రాచవేటివారిపల్లె గొల్లపల్లెలో తాగునీటి సదుపాయానికి విద్యుత్తును ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలని అన్నారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రత బాధ్యత పంచాయతీ కార్యదర్శులు దేనని అన్నారు. గ్రామాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వాటిని తక్షణం పరిష్కరించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి కృషి చేయాలని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, సర్పంచులు వరలక్ష్మి, ఉషారాణి, జి.శ్రీవాణి నవీన్, సుబ్రమణ్యం, పాపులమ్మ మల్లప్ప, రెడ్డప్ప, ఎంపిటిసిలు, తహశీల్దార్ అమర్నాథ్, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, సిడిపిఒ సుజాత, వివిధ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలకు నిలయం..మల్లయ్య కొండ

- శివరాత్రికి ముస్తాబవుతున్న శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున ఆలయం
- చోళ రాజుల కాలంలో ఆలయ నిర్మాణం



మల్లయ్య కొండపై వెలసిన శ్రీమరాంబికా మల్లికార్జున ఆలయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె సమీపంలోని సాధు, ఇనుము, మల్లయ్య కొండ, మూడు కొండల సముదాయం, ప్రకృతి అందాలతో ఆకర్షణీయమైన మల్లయ్య కొండపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు ఆలయం ఉంది. నాటి చోళుల రాజు కాలంలో ఏకిలా దొరలచే సముద్ర మట్టానికి 1500 అడుగుల ఎత్తున ఈ ఆలయాన్ని నిర్మించారు. పెద్దిరెడ్డి కుటుంబం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి కృషి ఫలితంగా ఆలయ పునః నిర్మాణం, రోడ్డు సౌకర్యం కల్పించారు. మల్లయ్యకొండ కింద నేల మల్లేశ్వర స్వామి ఆలయ ఒక ద్వారం నుండి భక్తులు మల్లయ్య కొండకు బయలుదేరుతారు. కొండకు వెళ్లే మార్గం మధ్యలో స్వామి సోదరి వెలుగు మల్లమ్మ కొలువై ఉంది. కొండకు వెళ్లే దారిలో ఎలకతీర్థం ఉంది. రాతిబండలో ఎలక తోక లాగా నీటి ద్వారా ఎప్పుడు రావడం విశేషం. కొండపై కోనేరు ఉంది. ఆలయానికి తూర్పు దిశగా వీరన్న దేవిగుహ ఉంది స్వామివారి సాధుకుండ పల్లెలుక, ఎల్లెలుక తోడుగా ఈ సొరంగం మార్గం నుండి మల్లయ్య కొండకు చేరినట్లు చెబుతారు.ఆలయాన్ని ఉత్తర దిశలో అరకిలో మీటర్ దూరంలో ఒక రాతిబండలో గౌరమ్మ గుడి ఉంది స్వామి పై గౌరమ్మ అలకతో అక్కడికి వచ్చి స్థిరపడినట్లు కథనం.ఈ ఆలయం పైన భాగంలో వ్యూ పాయింట్ ఉంది ఇక్కడ సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుమల కొండల వెలుగు దర్శనం ఇవ్వడం విశేషం. ఆలయానికి దక్షిణ దిశగా బండ రాతిలో ఏకధాటిగా నీటి ధార రావడం విశేషం. 26 అడుగుల ఎత్తులో బండరాతిలో స్వచ్ఛమైన నీటి ద్వారా వచ్చి చలంగా ఉంటుంది. రాతిబండ నుండి నీరు రావడం ఔషధ గుణాలు కలిగి ఉంటాయని దీర్ఘకాలిక వ్యాధులు చర్మవ్యాధులు నయమవుతాయని ప్రజల నమ్మకం. మహాశివరాత్రికి 60 రోజులు ముందుగానే మల్లయ్య దేవరలు నల్లటి ఆకర్షణీయమైన దుస్తులు, తలపైన ఎలుగుబంటి చర్మంతో టోపీ, విభూది ధరించి, డమరుకం వాయిస్తూ పిల్లనగ్రోవి ఊదుతూ శివతాండవం నృత్యం చేస్తూ మహాశివరాత్రి ఉత్సవాలను భక్తులను ఆహ్వానిస్తారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదాన ట్రస్ట్ ద్వారా దాతలు ఆర్థిక సహకారంతో రుచికరమైన వంటకాలతో అన్నదానం చేస్తారు.

ప్రతి రైతూ యూనిక్ ఐడి పొందాలి : డిఎఒ

ప్రజాశక్తి-రామాపురం

రైతులు భూముల యూనిక్ ఐడి కోసం భూమి యొక్క పట్టాదారు పాసుబుక్ లేదా వన్ బి రైతు ఆధార్ కార్డు సంబంధిత లింకు ఉన్న ఫోన్ నెంబర్ రైతు సేవ కేంద్రంలో నమోదుచేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని గోపగుడిపల్లి కల్పనాయుని చెరువు రైతుసేవ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు (యూనిక్ ఐడి) ఆధార్ కార్డ్ తరహాలో ఇస్తుందన్నారు సొంత భూములు గల రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వివిధ పథకాలు రాయితీలు పిఎం కిసాన్ , ఎరువుల రాయితీలు, పెట్టుబడి రాయితీలు, పంటల రుణాలు వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల సేవలు పొందాలంటే రెవిశిష్ట సంఖ్య నమోదుతప్పనిసరి నమోదు చేసుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి రైతుసేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రుణాలతో స్థిరమైన జీవనోపాధి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వ రుణాలతో స్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలని వెలుగు ఎపియం ఖాదర్‌వలి కోరారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు తీసుకొంటున్న ఋణాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.తీసుకొన్న సామాజిక పెట్టుబడి ,స్త్రీ నిధి,బ్యాంకు లింకేజ్, ఉన్నతి తదితర రుణాలను సక్రమంగా చెల్లించి అధిక రుణాలను పొందాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాల్లో పెరటి మొక్కలు, హోమ్ కపోస్టులు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో సీసీలు కృష్ణయ్య,నాగేంద్ర,గంగాధరం, సుధాకర్, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి లావణ్య,కోశాధికారి గులాబ్ జాన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎస్ఐసి'లో ఛాంపియన్‌గా 'గొబ్బిళ్ల అక్షర' విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు

నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ చాలెంజ్-2025 సీజన్ 8లో భాగంగా ఈనెల 20న బెంగళూరులో జరిగిన ఫైనల్స్‌లో గొబ్బిళ్ళ అక్షర స్కూల్ విద్యార్థులు ఎన్. లక్ష్మీ చైతన్య, ఎస్.జైనబ్ 14 పైగా రాష్ట్రాల విద్యార్థులతో పోటీపడి మొదటి బహుమతి గోల్డ్ మెడల్, క్యాష్ రివార్డ్ గెలుచుకున్నారని గొబ్బిళ్ళ అక్షర స్కూల్ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, కరస్పాండెంట్ గొబ్బిళ్ళ శ్రీనాథ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యాలోక ఆధ్వర్యంలో ఎల్‌టిఐ మైండ్ ట్రీ వారి సహకారంతో ప్రతిస్తాత్మకంగా జరిగిన ఫైనల్‌లో నందలూరు లాంటి చిన్న గ్రామం నుంచి జాతీయస్థాయి వేదికపై అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఆల్ ఇండియా నెంబర్ వన్ ర్యాంకు సాధించడం గర్వకారణమని అన్నారు. వారి విజయంలో ప్రధాన భూమిక పోషించిన మెంటర్ వరప్రసాద్‌ను అభినందించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-రామాపురం

పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి దర్గా స్వామి నెలకొల్పిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ భయ్యా రెడ్డి, ఎంఇఒ-2 జయచంద్ర పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట దర్గా స్వామిజీ ఆశ్రమంలో ఆవరణంలో దర్గా స్వామి నెలకొల్పిన శ్రీ సద్గురు దర్గా సాయి విద్యామందిర్ పాఠశాల 22వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల్లోని పేద ప్రజల చదువుకోవడం దర్గా స్వామి ఈ పాఠశాలను స్థాపించారని తెలిపారు. సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యమయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటోలకు పోలీసు నంబర్ తప్పనిసరి

ప్రజాశక్తి-సండుపల్లి

మండలంలో ప్రతి ఆటోకు పోలీసు సీరియల్ నంబర్ కలిగి ఉండాలని రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు పోలీసు నంబర్‌లను అందజేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పకుండా ప్రతి ఒక్కరు సీరియల్ నెంబర్లను తీసుకొని తమ ఆటోలకు అతికించుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, ప్యాసింజర్లకు ఇబ్బం దులు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యతపై డ్రైవర్లపై ఉందని అన్నారు. పోలీసు నంబర్ కలిగి ఉంటే ఆటో సంబంధించిన వివరాలన్నీ అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సుండుపలి ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు, వీరబల్లి ఎస్ఐ మోహన్ నాయక్ పాల్గొన్నారు.

'సుంకు ఉష గౌతమి'లో ఘనంగా ఫేర్వెల్ డే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని సుంకు ఉష గౌతమి మెమోరియల్ జూనియర్ కాలేజీలో ఫేర్వెల్ డే వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంలో తమ కళాశాల ముందుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకోని రావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఈనెల 24 నుంచి మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. విద్యార్థులు అర్హతలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశా లో ఉండాలని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24, 2024-25 రెండు సంవత్సరాలు చదివి ఉండాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో గాని ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో గాని ఐదవ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఒసి, బిసి విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2025 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 10-9-2011 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలు రుసుం ఒసి, బిసిలకు రూ.150లు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.75లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20 నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించి ఉన్నట్లు ప్రిన్సిపల్ తెలియజేశారు. వివరాల కొరకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, ఎంఇఒలను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం మండలం, రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరంలో భాగంగా గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక కీళ్ళు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 15 మందికి కంటి, మోకాళ్ల ఆపరేషన్లకు ఎంపికయ్యారని అన్నారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని డాక్టర్ లోకేష్ భరణి తెలిపారు కార్యక్రమంలో పిటిఎం మండలం ఎంఇఒ గౌస్ పీర్, ఎస్.ఐ. హరిహరప్రసాద్, సెక్రటరీ శివ, ఆశా వర్కర్స్ జ్యోతి,సుజాత స్థానికులు, మహబూబ్ బాషా, సి.రవిశంకర్, నారాయణమూర్తి, డి.శంకర పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి-కలకడ



బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు నిర్వహిం చడం జరుగుతుందని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. శనివారం మండలంలోని దేవళంపేటలని శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడును జాతర సమయంలో జరిగే విషయాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిపారు. శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయానికి అనుసంధానంగా జరిగే మహాశివరాత్రి మరుసటి రోజు జరిగే జరిగే మహోత్సవానికి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జరి మహోత్సవానికి బస్సులు ద్వారా భక్తులను వన్‌వే ద్వారా చేరడం జరుగుతుందని ఆ సమయంలో ఆటోలలో ప్రయాణికులు ప్రయాణించకుండా నియంత్రిం చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది రామ్మోహన్, మహబూబ్ బాషా, సుబ్బయ్య పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెడ్డి జెఎసి నాయకులు

'ఉయ్యాలవాడ'కు ఘన నివాళి

ప్రజాశక్తి-కలికిరి

తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178 వర్ధంతి సందర్భంగా కలికిరి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలు ఘనంగా నివాళులు అర్పించారు. ఆంగ్ల ప్రభుత్వాన్ని గడగడలాడించిన పరాక్రమశాలి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి కొనియాడారు. ఉత్తరభారతదేశంలో 1857లో స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంటే, ఆంధ్రప్రాంతంలోని రాయలసీమలో 1847లోనే ఆంగ్ల నిరంకుశ పాలనను ఎదిరించి తృణప్రాయంగా ప్రాణాలర్పించిన వీరసింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు, త్వరలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలికిరి పట్టణంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రాంప్రసాద్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, చెప్పండి అమర్నాథ్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి, జయరామిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చక్రపాణి రాజారెడ్డి, ధరణి హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ మస్తాన్‌అహ్మద్

ప్రజాశక్తి-కలకడ



వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా కలకడకు చెందిన షేక్ మస్తాన్‌అహ్మద్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన మాజీ సిఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మైనార్టీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్



నిందితుల అరెస్టు చూపుతున్న డిఎస్‌పి, పోలీసు సిబ్బంది

గంజాయి ముఠా అరెస్టు

- రూ. 2.5 లక్షలు విలువైన 20 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్ట్‌కు సిఫారసు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయి ముఠాను శనివారం రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.2.5 లక్షల విలువ చేసే 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక రెండో పట్టణ పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కొండయ్యనాయుడు మాట్లాడుతూ ఎస్‌పికి వచ్చిన పక్కా సమాచారం మేరకు క్రైమ్ సిఐ చంద్రశేఖర్, రెండో పట్టణ సిఐ రామచంద్ర, రూరల్ సిఐ సత్యనారాయణ, క్రైమ్ సిబ్బంది తదితరులు గంజాయి సరఫరాదారులపై డేగ కన్ను వేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మదనపల్లి పట్టణం చంద్రా కాలనీకి చెందిన భాగ్యమ్మ, ఆవుల శివమ్మ, ఆవుల అనిల్ గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డారన్నారు. వీరి వద్ద నుంచి రూ.2.5 లక్షలు విలువ గల 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పలమనేరు, పుంగనూరు, పిటిఎం పోలీసు స్టేషన్‌లో భాగ్యమ్మ పై గతంలో మూడు గంజాయి కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. వైజాగ్ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు నిందితులు తెలిపారన్నారు. వీరిపై పీడీ యాక్టు నమోదు చేసేందుకు ఎస్‌పికి సిఫారసు చేస్తామని చెప్పారు. థతెలిపారు. మదనపల్లె నియోజకవర్గం లో ఎక్కడైనా గంజాయి విక్రయాల జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని, గంజాయిని నియంత్రించేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మదనపల్లె పట్టణ, పరిసర ప్రాంతాల్లో కొంతమంది యువత గంజాయికి బానిసలుగా మారారని అన్నారు. గంజాయి సేవించినట్లు తెలిస్తే వారిని స్టేషన్ కు తీసుకొచ్చి వాసన పట్టి కూడా వారిపై బైండోవర్ చేసుకుని అవసరమైతే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

కారు ఢీ కొన్న సంఘటన శనివారం ములకలచెరువులో చోటు చేసుకుంది స్థానికులు, పోలీసుల కథనం మేరకు ములకలచెరువు మండలం, సోంపల్లి పంచాయతీ, తలావారిపల్లికి చెందిన తలారి తిప్పన్న కుమారుడు తలారి వెంకటనారాయణ వ్యవసాయం చేసుకుంటూ కటుంబాన్ని పోషిస్తున్నారు. వెంకటనారాయణ తన సొంత పనుల నిమిత్తం ద్విరక్ర వాహనంలో ములకలచెరువుకు వస్తుండగా కదిరి వైపు నుంచి మదనపల్లెకు వెళ్తున్న కారు స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో వెంకటనారాయణ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటనారాయణ తీవ్రంగా గాయపడ్డాను స్థానికులు వెంటనే ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. వెంకటనారాయణకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ములకలచెరువు పోలీసులు విచారణ చేపట్టారు.

మిద్దెపై నుంచి పడి మరో వ్యక్తికి...

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం మండలంలో జరిగింది. స్థానికలు తెలిపిన వివరాల మేరకు..ముష్టూరు పంచాయతీ పట్టావారిపల్లెకు చెందిన కె.గంగాధర మర్రిబండ వెంకటాపురంలో సొంత ఇంటిని నిర్మించుకుంటున్నారు. ఇతను ఎలక్ట్రీషన్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. శనివారం ఉదయం తన ఇంటిపై చుట్టూ గోడను కట్టారు. సాయంత్రం స్నేహితులతో మిద్దె పైకి వెళ్లి గోడ ఉన్న కమ్మీలకు ఆనుకొని స్నేహితులతో మాట్లాడుతూ కర్బూజా కాయ తింటుండగా ఒక్కసారిగా కమ్మీలు ఊడిపోయి పడిపోవడంతో, వాటితో పాటు అతను కూడా పైనుంచి క్రింద పడ్డారని అన్నారు. తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించి, 108 వాహనం ద్వారా మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.